కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టుపై టిడ్కో ఇండ్ల భవన సముదాయాలు



టిడ్కో ఆశలు

- కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో 18,992 ఇళ్లు చేపడితే.. 16,945 పూర్తి
- గత జగన్ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం
- ముళ్లు కంపలు పెరిగి శిథిలావస్థకు చేరిన భవనాలు
- మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రాకతో పేదల్లో ఆశలు
- వివరాలు సేకరిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం
- మరమ్మతుల అనంతరం పంపిణీకి కసరత్తు

గత జగన్ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం పేదలకు శాపంగా మారింది. నిరుపేదలకు నీడ కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో ఇళ్ల సముదాయం నిర్మాణం చేపట్టింది. లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో టీడీపీ ప్రభుత్వం పడిపోయి.. వైసీపీ ప్రభుత్వం కొలువుదీరింది. చంద్రబాబు మంచిపేరు వస్తుందని గత జగన్ ప్రభుత్వం పేదలకు ఈ ఇండ్లను అప్పగించలేదు. ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల ముళ్ల కంపలు పెరిగి ఇండ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. దొంగలు పడి విద్యుత్ వైర్లు ఎత్తుకెళ్లారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో టిడ్కో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం పేదలకు టిడ్కో ఇళ్లు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తోంది. తాజా పరిస్థితిపై ఆంధ్రప్రదేశ్ టౌన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) ఇంజనీర్ల నుంచి ప్రభుత్వం నివేదికలు కోరింది. త్వరలో టిడ్కో ఇళ్లలో పేదలు గృహ ప్రవేశాలు చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.



వివిధ పట్టణాల్లో టిడ్కో ఇళ్ల పురోగతి:

పట్టణం	మంజూరైన ఇళ్లు	పూర్తైనవి	మౌలిక వసతులు
కర్నూలు	10,000	9,181	2,064
ఎమ్మిగనూరు	4,272	4,272	2,000
ఆదోని	4,720	3,492	2,000
మొత్తం	18,992	16,945	6,064

కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కర్నూలు నగరం సహా నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ పట్టణాల్లో పేదలకు నీడ కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర విభజన తరువాత కొలుదీరిన ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం ప్రధానమంత్రి అవాస్ యోజన-ఎన్టీఆర్ ఇళ్లు పథకం కింద నాలుగు విడతల్లో కింద 52,318 ఏపీ టిడ్కో ఇళ్లు మంజూరు చేసింది. రూ.3,130 కోట్లతో జీ ప్లస్ 3 అపార్ట్‌మెంట్స్ ఇటుకలు, పిల్లర్లు లేకుండా షేర్‌వాల్ టెక్నాలజీతో నిర్మాణాలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ టౌన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు మొదలు పెట్టారు. మహారాష్ట్రకు చెందిన షాపూజీ-పల్లోంజీ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. కర్నూలు నగరం శివారులోన జాతీయ రహదారి పక్కనే జగన్నాథగట్టుపైన, ఎమ్మిగనూరులో శివన్న నగర్, మైనార్టీ కాలనీల్లో, ఆదోనిలో సిరుగుప్ప కూడలి సమీపంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ గృహాలను నిర్మించారు. జిల్లాలో 15 వేల గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేస్తున్న సమయంలో 2019 మార్చి 10న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ జారీ చేయడం, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇళ్ల పంపిణీ ఆగిపోయింది. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి.. జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం కొలుదీరింది. టిడ్కో ఇళ్లు అప్పగిస్తారని పేదలు ఆశించారు. గత జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క ఇంటిని కూడా లబ్ధిదారులకు అప్పగించలేదు. నిరుపయోగంగా మారడంతో నిర్వహణ లేక ఇనుప కడ్డీలు తుప్పు పట్టాయి. ఇళ్ల మధ్య ముళ్ల కంపలు పెరిగి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.



బయటకు కనిపించేలా జగన్ ప్రభుత్వం భవనాలకు వేసిన రంగులు

● జగన్ నిర్లక్ష్యం.. పేదలకు శాపం

గత జగన్ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం పేదలకు శాపంగా మారింది. కర్నూలు నగర శివారున జగన్నాథగట్టుపై 150 ఎకరాల విస్తీర్ణంలో ఆనాటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లు నిర్మిస్తే.. 2019 మే నెలలో కొలువుదీరిన జగన్ ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పగించలేదు. నిరుపయోగంగా ఉన్న ఆ ఇళ్లలో దొంగలు పడ్డారు. నాలుగైదు బ్లాకుల్లోని వేలాది ఇళ్లలో విద్యుత్ స్విచ్ బోర్డులు, మెయిన్ ప్యానల్ బోర్డులు, జంక్షన్ బాక్సులు పగులగొట్టి విద్యుత్ వైరును దొంగలించారు. విలువ రూ.2.50 కోట్లకు పైగా ఉంటుందని కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగులు పేర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ ఇళ్లు తామే కట్టామనే ప్రచారం కోసం బయట ఆ పార్టీ రంగులు వేసి వదిలేశారు. ఇళ్లలో వెళ్లి చూస్తే అడుగు పెట్టాలంటేనే భయం వేస్తుంది. ఇళ్లంతా దుమ్ము.. బూజు చేరి ఇనుప సామగ్రి తప్పు పట్టింది. పలు ప్లాట్లలో ఎక్కడి మట్టి అక్కడే వదిలేశారు. పిచ్చి మొక్కలు పెరిగి పాడుబడిపోతున్నాయి. కరోనా సమయంలో 2,500 టిడ్కో ఇళ్లను కరోనా బాధితుల క్వారంటైన్ కేంద్రాలుగా మార్చడంతో పలువురు కరోనా బాధితులకు కీలక సమయంలో నీడ కల్పించింది. ఆదోని, ఎమ్మిగనూరులోనూ ఇదే పరిస్థితి ఉంది.

పేదల్లో ఆశలు

టిడ్కో ఇళ్లు నిర్మాణం చేసిన చంద్రబాబు ప్రభుత్వమే ఐదేళ్ల తరువాత మళ్లీ కొలుదీరింది. ఈ నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. గత జగన్ ప్రభుత్వంలో నిర్వీర్యం చేసిన వివిధ శాఖల్లో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే ఏపీ టిడ్కో ఇళ్ల తాజా పరిస్థితిపై దృష్టి సారించారు. ప్రస్తుతం ఏ పరిస్థితిలో ఉన్నాయి..? గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పేరుకుపోయిన ముళ్ల కంపను తొలగించేందుకు ఎంత ఖర్చు అవుతుంది..? తక్షణమే పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు ఎన్ని..? తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు ఉన్నాయా..? లేకపోతే వాటికి అయ్యే ఖర్చు ఎంత..? వంటి వివరాలను టిడ్కో ఇంజనీర్లు ద్వారా నివేదికలు తెప్పించుకుంటోంది. ఆ గృహాల పంపిణీకి టీడీపీ కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కర్నూలు జిల్లాలో 16,945 ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యాయి. అయితే 6,064 గృహాలు లబ్ధిదారులకు అప్పగించినా మౌలిక వసతులు సమకూర్చగలమని ఇంజనీర్లు అంటున్నారు. కర్నూలు నగరంలో 2,064, ఆదోనిలో రెండు వేలు, ఎమ్మిగనూరులో 2 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేస్తే తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు వంటి సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని నివేదిక ఇచ్చినట్లు సమాచారం.



జగన్ ప్రభుత్వ నిర్వాకంతో అర్ధాంతరంగా మారిన టిడ్కో గృహాల ప్రాంతం



అంతా 'రివర్స్'

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు విడతల్లో 52,318 ఇళ్లను ఆనాటి టీడీపీ మంజూరు చేస్తే.. 2019 మేలో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం రివర్స్ టెండర్ల పేరిట పేదలను దగా చేసింది. పనులు మొదలు పెట్టలేదని 20.736 ఇళ్లను రద్దు చేసింది. మిలిగిన 31,582 ఇళ్లలో 29,082 ఇళ్లలో ఆనాటి టీడీపీ ప్రభుత్వంలోనే 85 శాతం ఇళ్లు పూర్తి అయ్యాయి. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. 23,851 ఇళ్లు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నప్పటికి ఐదేళ్లలో పేదలకు ఇవ్వలేదు. వివిధ దశల్లో ఉన్న 7,731 ఇళ్లకు అదనంగా గంపెడు సిమెంట్ కూడా వేయకపోవడంతో ఎక్కడికక్కడే ఆగిపోయాయి. 2,500 ఇళ్లకు రివర్స్ టెండరింగ్ విధానంలో టెండర్లు నిర్వహించినా ఒక్క ఇంటిని కూడా కట్టలేకపోయారు. ఇది గత జగన్ ప్రభుత్వం రివర్స్ విధానం. ఆ తప్పులను మళ్లీ చంద్రబాబు సరిచేసి పేదలకు పక్కా గృహాలను కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంటి వద్దకే పింఛన్లు

ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం




కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: జూలై 1వ తేదీన గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పింఛన్ల పంపిణీపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. అదే రోజు పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఒక్కొక్క సచివాలయం ఉద్యోగికి 50 ఇండ్ల చొప్పున మ్యాపింగ్ వేసుకుని పింఛన్లను పంపిణీ చేయాలన్నారు. అదనంగా ఉద్యోగులు అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. మొత్తం నాలుగు రకాల కేటగిరీల పింఛనుదారులలో 11 సబ్ కేటగిరీలకు చెందిన పింఛన్‌దారులకు మొత్తం రూ.7వేలు అంటే జూలై మాసానికి రూ.4వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలలో మూడు నెలలకు సంబంధించి నెలకు రూ.1000 చొప్పున బకాయిలు మొత్తం రూ.3వేలు పంపిణీ చేయాలని, మిగిలిన కేటగిరీలకు ప్రస్తుత ప్రభుత్వం పెంచిన విధంగానే నగదును పంపిణీ చేయాలని అన్నారు.

2,45,229 మందికి పంపిణీ:

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 2,45,229 మందికి రూ.167,34,60,500 పంపిణీ చేసేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా జూలై 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. అదనంగా ఉద్యోగులు అవసరం అయితే ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలను అయితే గ్రేడ్-4, గ్రేడ్-1 వరకు ఉపయోగించుకోవచ్చన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, మెప్మా పీడీ డైరెక్టర్ నాగశివలీల పాల్గొన్నారు.

మంత్రాలయం మఠం హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు

మంత్రాలయం, జూన్ 27: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,41,46,445 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. 29వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని మఠంలోని గురురాజాంగణ భవనంలో లెక్కింపు నిర్వహించారు. ఇందులో నగదు రూపంలో రూ.3,41,46,445 ఆదాయం సమకూరగా, 2.570 కిలోల వెండి, 82 గ్రాముల బంగారు వచ్చాయి. వీటితో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీ వచ్చింది. దేవదాయ శాఖ ఇన్స్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నడుమ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంత పురాణిక్, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, వాణి, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.




హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

రేషన్ దందాను సహించం

- ఆదోని సివిల్ సప్లై గోదామును తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి
- గోదాం ఇన్‌చార్జిని సస్పెండ్ చేయాలని ఆదేశం

ఆదోని, జూన్ 27: ఆదోనిలో రేషన్ అక్రమ దందాను సహించనని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. గురువారం ఆంధ్రజ్యోతిలో అచ్చయిన ఆదోనిలో రేషన్ దందా అనే ఉన్న కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. సీఎస్‌డీటీ వలిబాషాతో పాటు ఆంధ్రజ్యోతితో కలిసి మండల స్టాక్ పాయింట్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో గోదాం ఇన్‌చార్జి రవీంద్రనాథ్ రెడ్డి లేకపోవడం, కంప్యూటర్ మహిళా ఆపరేటర్‌గా పనిచేస్తున్ మెర్సీ విక్టోరియా మాత్రమే ఉన్నారు. ఎమ్మెల్యే స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుసుకున్న తహసీల్దార్ హసీనా సుల్తానా అక్కడకు చేరుకున్నారు. అనంతరం స్టాక్ పాయింట్‌లో ఉన్న 50 కేజీల బియ్యం బస్తాలను తూకం వేసి పరిశీలించారు. 50 కేజీలు ఉండాల్సిన బియ్యం బస్తాలో 40 కేజీలు, 42 కేజీలు ఉన్నాయి. దీనిపై అక్కడ నుండే ఎమ్మెల్యే పార్థసారథి సివిల్ సప్లై జిల్లా అధికారి షర్మిలకు ఫోన్ చేసి మాట్లాడారు. గోదాం ఇన్‌చార్జి సక్రమంగా ఉండటం లేదని, ప్రస్తుతం కూడా తహసీల్దార్, సీఎస్‌టీటీ ఉన్నారని, గోదాం ఇన్‌చార్జిని సస్పెండ్ చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు. ఆదోని నుండి రేషన్ బియ్యాన్ని అక్రమంగా సరఫరా చేసినట్లు తెలిస్తే క్రిమినల్ చర్యలు చేపడతానని హెచ్చరించారు.



ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్న ఎమ్మెల్యే



తూకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాజీనామా ఇవ్వాల్సిందే

- వీసీలకు ఉన్నత విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ ఆదేశాలు..?
- రెండు రోజుల్లో రిజిస్ట్రార్లు సిద్ధంగా ఉండాలని అమరావతి నుంచి సూచనలు

కర్నూలు(అర్బన్), జూన్ 27: ఉప కులపతులు వెంటనే తమ రాజీనామాలు గవర్నర్‌కు నివేదించాలని మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. గురువారం జిల్లాలోని యూనివర్సిటీలకు చెందిన ఉపకులపతులు ఉన్నత విద్యాశాఖలోని డిప్యూటీ సెక్రటరీలను సంప్రదించగా ఈ సూచనలు చేసినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించి పలు వివాదాస్పద నిర్ణయాల్లో కొందరు ఉపకులపతులు వ్యవహరించిన తీరు పట్ల స్థానికంగా కూడా తీవ్ర వ్యతిరేకతలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో కొందరు విద్యార్థి సంఘాల నాయకులు మంత్రి నారా లోకేష్‌కు వినతుల ద్వారా జిల్లాలోని యూనివర్సిటీల్లో జరుగుతున్న అక్రమాలు, అవినీతికి సంబంధించి పలు ఆధారాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ విద్యార్థి సంఘం ఉన్నత విద్యా శాఖ ఛైర్మన్‌పై ఇలాంటి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే బాటలో రిజిస్ట్రార్లు కూడా సిద్ధంగా ఉండాలని మౌఖికంగా సూచనలు అందాయని జిల్లాలోని ఓ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఉపకులపతులు రాజీనామాలు చేసేందుకు ససేమిరా అన్నట్లు సమాచారం. అవసరమైతే న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధమౌతున్నట్లు సమాచారం. అవినీతి అక్రమాల్లో తమ పాత్ర లేన్నప్పుడు ఎందుకు రాజీనామా చేయాలని ఉన్నత విద్యాశాఖ సెక్రటరీని ప్రశ్నిచడంతో సీఎంవో ఆదేశాల మేరకు రాజీనామా చేయాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

పక్కాగా చెప్పారు ప్రైజ్ కొట్టారు..!

కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు..? రాష్ట్రంలో టీడీపీ కూటమికి.. వైసీపీకి ఎన్నేసి సీట్లు వస్తాయి..? జనం నాడి తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అంటూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయో అంచనా వేసి చెప్పాలంటూ పాఠకులను కోరింది. వారానికి రెండు కూపన్లు ప్రచురించింది. ఆంధ్రజ్యోతి పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. వేలాది కూపన్లు రాగా.. రాష్ట్ర స్థాయిలో ఆంధ్రజ్యోతి పాఠకులు ఏకంగా 13 మంది టీడీపీ కూటమికి 164 సీట్లు వస్తాయని, వైసీపీ కేవలం 11 స్థానాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ కంటే ముందే కచ్చితమైన అంచనా వేశారు. అందులో కర్నూలు జిల్లా నుంచి ఇద్దరు పాఠకులు పక్కా అంచనాతో కూపన్ల పంపారు. ఆ 13 మంది కూపన్లను డ్రా తీస్తే కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా సమీపంలో నివాసం ఉంటున్న ఎస్.మహేశ్వరి, గిడ్డయ్య దంపతులు రెండో స్థానంలో నిలిచి రూ.50 వేలు బంపర్ ప్రైజ్ అందుకున్నారు. ఆ ప్రైజ్ చెక్కును గురువారం ఆంధ్రజ్యోతి కర్నూలు యూనిట్ మేనేజర్ ఎ. లక్ష్మన్, ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్ కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి జి. కొండప్ప, సర్క్యులేషన్ మేనేజర్ జి. సోమశేఖర్‌రెడ్డి, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టరు సుంకన్న తదితరులు వారికి అందజేశారు.

- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతకు నగదు ప్రోత్సాహకం


విజేత మహేశ్వరి కుటుంబం


విజేతకు చెక్కును అందజేస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

తెలిసినవాళ్లకు చెబితే హేళన చేశారు

మాకు రోజు పేపర్ చదవడం అలవాటు. టీవీల్లో న్యూస్ ఛానల్స్ నిరంతరం చూస్తుంటాం. ప్రజలను ఎవరికి అడిగినా టీడీపీ కూటమి విజయం సాధిస్తుదనే చెప్పారు. అందుకే రాష్ట్రంలో కూటమి 164 సీట్లు, వైసీపీకి 11 సీట్లకు మించి రావని అంచనా వేశాం. అదే సంఖ్య ఆంధ్రజ్యోతి కూపన్‌లో నింపి పంపాం. మా మిత్రులు, తెలిసిన వాళ్లతో ముందే చెబితే నమ్మకపోగా హేళన చేశారు. చివరికి మా అంచనాలే కరెక్ట్ అయ్యాయి. రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి రావడం ఆనందంగా ఉంది.

-విజేత దంపతులు మహేశ్వరి, గిడ్డయ్య

కష్టాలను అధిగమించి కలెక్టర్ దాకా..!

- స్ఫూర్తిదాయకం కలెక్టర్ రంజిత్ బాషా ప్రస్థానం
- నేడు కర్నూలులో బాధ్యతల స్వీకరణ


కలెక్టరు పి.రంజిత్‌భాషా

కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎవరూ పేదరికంతో పుట్టరు.. ఆ పేదరికంపై విజయం సాధించి సగర్వంగా నిలిస్తేనే జన్మ సార్థకత అవుతుంది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని అత్యున్నత స్థానానికి చేరుకున్నారు. ఐఏఎస్ అధికారి రంజిత్ బాషా చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి కలల సాకారం కోసం అహోరాత్రులు కష్టపడి నేడు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు పి.రంజిత్ బాషా. ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిబాషాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల కలెక్టరుగా పని చేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేసింది. శుక్రవారం ఉదయం 10:15 గంటలకు కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఆయన్ను పలకరించగా జన్మభూమి గడ్డపై కలెక్టర్‌గా పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన వివరించారు.

నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణానికి చెందిన హలిమాబీ, గోకారి సాహెబ్ దంపతులు సంతానం పి.రంజిత్‌భాషా. 1975 ఆగస్టు 31న జన్మించారు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయారు. ఆలనపాలన అమ్మ హలీమాబీపై పడింది. కొడుకును ఉన్నతంగా చూడాలనే సంకల్పంతో హలీమాబీ కుమారుడు రంజిత్‌భాషాను నందికొట్కూరు పట్టణం సంతపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. 7వ తరగతి వరకు ఆ బడిలోనే చదుకున్నారు. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలో ఉన్న ఏపీ గురుకుల పాఠశాలలో సీటు రావడంతో 8వ తరగతిలో చేరారు. 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. నందికొట్కూరులోని ప్రభుత్వ కళాశాల్లో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. అమ్మ హలీమాబీ ప్రోత్సాహంతో అనంతపురం జిల్లాలోనే ఎస్కే యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మాథ్స్, సిక్కిం మణిపాల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. ఓ వైపు ఉన్నత చదువులు కొనసాగిస్తూనే.. మరో వైపు 2003లో గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో ఎలాగైనా ర్యాంక్ సాధించాలనే పట్టుదలతో సాధన చేశారు. అనుకున్న లక్ష్యంగా దిశగా అడులు వేశారు. రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టరుగా 2007లో ఎంపికయ్యారు. 2018 ఫిబ్రవరిలో ఐఏఎస్‌గా పదోన్నతి పొందారు. అమ్మ హలీమాబీ కలలు సాకారమైన రోజు అది. అందుకే అమ్మ అంటే ఆయనకు ఎంతో ప్రేమ.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో దిట్ట

కంప్యూటర్ కోర్సులో ఎమ్మెస్సీ చేసిన రంజిత్‌భాషాకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడంలో ఆయన దిట్ట. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు సాఫ్ట్‌వేర్లు రూపకల్పనలో ప్రశంసలు అందుకున్నారు. గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపిక కాకమునుపు పోస్టల్ శాఖలో పని చేసే సమయంలో ఆ శాఖకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తయారు చేసి ఆ శాఖ రాష్ట్ర పోస్టుమాస్టర్ జనరల్ నుంచి అవార్డు అందుకున్నారు. ఈ తరువాత రాష్ట్ర ప్రభుత్వం సేవల్లోకి వచ్చాక వ్యవసాయ, రెవెన్యూ శాఖ సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వీలుగా ఈ-క్రాప్ పోర్టర్‌ను తయారు చేశారు. మీ-సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు 64 సేవలు అందించేందుకు వీలుగా రెవెన్యూ సేవలతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేయడంతో పాటు సీఎం చంద్రబాబును ఒప్పించి గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ జరిగేలా కృషి చేయాలని జిల్లా రైతులు, మేధావులు ఆకాంక్షిస్తున్నారు.

కడప ఆర్డీఓగా ఉద్యోగ ప్రస్థానం

ఉమ్మడి రాష్ట్రంలో 2007లో గ్రూప్-1 ఆఫీసరుగా ఎంపికైన రంజిత్‌భాషా తొలుత కడప ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టి ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారు. ఆ రోజు అమ్మ ఆనందం అక్షరాలకు అందనిది అంటున్నారు. ఆ తర్వాత గుడివాడ ఆర్డీఓగా, సీసీఎల్ఏ పీడీసీ ఎమ్మార్వోగా విధులు నిర్వర్తించారు. 2018లో ఆనాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ వద్ద ఓఎస్డీగా పని చేశారు. ఆ సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఐఏఎస్ పదోన్నతి కల్పించారు. విజయవాడ నగరపాలిక కమిషనర్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి డైరెక్టరుగా, నెల్లూరు జేసీగా, కృష్ణా జిల్లా కలెక్టరుగా పని చేశారు. ప్రస్తుతం బాపట్ల కలెక్టరుగా పని చేస్తూ కర్నూలు కలెక్టరుగా బదిలీపై వస్తున్నారు. 2005లో ఈయనకు భానుతో వివాహమైంది. ఆమె కూడా ఎంఏ బీఈడీ చేశారు. వీరికి బీటెక్ చదువుతున్న లతిష్, ఇంటర్ చదువుతున్న హనీషా సంతానం.


అమ్మ హలీమాబీ, కుటుంబ సభ్యులతో కలెక్టరు రంజిత్‌భాషా

లాసెట్‌లో సత్తా చాటిన హర్షశ్రీ

రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు


హర్షశ్రీ

నంద్యాల (నూనెపల్లె), జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన లాసెట్ ఫలితాల్లో నంద్యాల పట్టణానికి చెందిన గురు హర్షశ్రీ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. నంద్యాలలోని ఎన్జీఓ కాలనీకి చెందిన తొమ్మండ్రు గురు ప్రసాద్ ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా ఉన్నారు. ఆయన సతీమణి మంజుల స్థానికంగా ఇంగ్లీష్ సబ్జెక్టులో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమార్తె హర్షశ్రీ గురువారం విడుదలైన లాసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలిచింది. కాగా ఇంటర్మీడియట్ ఎంపీసీలో 991 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. గత ఏడాది పంజాబ్‌లోని పటియాలలో జరిగిన ఎన్‌సీసీ నేషనల్ క్యాంపులో పాల్గొని 'బీ' సర్టిఫికెట్ కైవసం చేసుకుంది. అదేవిధంగా తెలంగాణ లాసెట్‌లోనూ హర్షశ్రీ 71వ ర్యాంకు సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ విద్యను పూర్తి చేసి కక్షిదారులకు న్యాయసేవ అందిస్తానన్నారు.

రాక్ గార్డెన్‌లో సినిమా షూటింగ్

- భారీగా తరలివచ్చిన బాలయ్య అభిమానులు
- పోలీసుల భారీ బందోబస్తు


రాక్‌గార్డెన్‌లో సన్నివేశాల దృశ్యం

ఓర్వకల్లు, జూన్ 27: మండలంలోని ఓర్వకల్లు సమీపంలో ఉన్న రాక్‌గార్డెన్ (రాతి వనాలు)లో గురువారం సినిమా షూటింగ్ నిర్వహించారు. సితార ఎంటర్‌ప్రైజస్ ఆధ్వర్యంలో మహేష్‌బాబు నిర్మాతగా బాబి దర్శకత్వంలో హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ హీరోగా, హీరోయిన్లుగా ప్రజ్ఞాజైశ్వాల్‌లు రాతివనాలలో సినీ సన్నివేశాలు చిత్రీకరించారు. ఎన్‌బీకే 109 పేరుతో చిత్రీకరిస్తున్న సినిమా రాక్‌గార్డెన్‌లో మరో రెండు రోజుల పాటు సన్నివేశాలు కొనసాగుతాయి. సినిమా షూటింగ్‌ను చూసేందుకు బాలకృష్ణ అభిమానులు, టీడీపీ అభిమానులు భారీగా తరలివచ్చారు. అయితే చిత్ర యూనిట్ షూటింగ్ ప్రదేశంలోకి ఎవరినీ అనుమతించలేదు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, నాయకులు తుగ్గలి నాగేంద్ర బాలకృష్ణను కలిశారు. రాతివనాల్లో గన్‌ఫైర్లు, గుర్రాల స్వారీ వాటితో పాటు ఆసక్తికర సన్నివేశాలను చిత్రీకరించారు. ఇదిలా ఉండగా గతంలో కూడా ఈ ప్రాంతంలో జయం మనేదేరా, టక్కరిదొంగ, ఆది, శంభో శివ శంభో, సుభాష్ చంద్రబోస్, బాహుబలి తదితర సినిమాలతో పాటు కన్నడ సీరియల్స్ సైతం ఇక్కడ చిత్రీకరించారు. కర్నూలు రూరల్ సీఐ పవన్ కుమార్ రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

బాలకృష్ణను కలిసిన తుగ్గలి నాగేంద్ర


సినీ హీరో బాలకృష్ణను కలిసిన తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి/ఓర్వకల్లు, జూన్ 27: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర గురువారం కలిశారు. ఓర్వకల్లులో రాక్‌గార్డెన్స్‌లో జరిగే సినిమా షూటింగ్‌కు వచ్చిన బాలకృష్ణను నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ చిత్ర యూనిట్‌కు తుగ్గలి నాగేంద్రను పరిచయం చేశారు. టీడీపీ కోసం శ్రమించే కార్యకర్తలకు, నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని బాలయ్య సూచించినట్లు తుగ్గలి నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు చౌదరి, వెంకటేశ్, ఎరుకలి చెరువు శివ తదితరులు ఉన్నారు.

త్వరలో కుల ధృవీకరణ పత్రాలు మంజూరు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: జిల్లాలో వీఆర్వోల ద్వారా వెరిఫికేషన్ చేయించిన తర్వాత కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఇంకా 2,29,685 మంది కుల ధృవీకరణ పత్రాలు తీసుకోలేదని, వారికి సీసీఎల్ఏ ఆదేశానుసారం గురువారం నుంచి వీఆర్వోలు ఇంటింటి సర్వే చేసి కులం, మొబైల్ నెంబర్ తదితర పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని అన్నారు. ఈ వివరాలతో తహసీల్దార్లు కుల ధృవీకరణ చేసిన తర్వాత పత్రాలు ఆటో మేటిక్‌గా జనరేట్ అవుతాయని, వాటిని సచివాలయాల్లో తీసుకోవచ్చని తెలిపారు.

4 నుంచి సంపూర్ణత అభియాన్

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు సంపూర్ణత అభియాన్ కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. గురువారం ఢిల్లీ నుంచి నిర్వహించిన నీతి అయోగ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు ఎన్ఐసీ ఛాంబర్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన యాస్పిరేషన్ బ్లాక్ ప్రదేశాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రతి యాస్పిరేషన్ బ్లాక్‌కు రూ.2 లక్షలను కేటాయింపు ఉంటుందని అన్నారు. కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సీపీవో హిమప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రానికి అవార్డు

బనగానపల్లె , జూన్ 27: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ సాంకేతికత, పరిశోధన, వినియోగ సంస్థ తరఫున 2023-24 సంవత్సరానికి గాను ఉత్తమ కృషి విజ్ఞానకేంద్రం అవార్డును బనగానపల్లెలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంకో ఆర్డినేటర్ ధనలక్ష్మి గురువారం అందుకున్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు రాజమండ్రిలోని ఉద్యాన విశ్వవిద్యాలయం వీఆర్ గూడెం, జాతీయ పొగాకు పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జోన్ 10 కృషి విజ్ఞానకేంద్రాల వార్షిక జోనల్ సమావేశాల్లో డైరక్టర్లు డాక్టర్ ఆర్‌కె మాతూర్, హైదరాబాద్‌కు చెందిన జాతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ డైరక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, ఆటారీ వారి ఆధ్వర్యంలో 4 రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాల విస్తరణ సంచాలకులు, నాలుగు రాష్ట్రాల కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు రాజమండ్రిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.

తహసీల్దార్లు తహ..తహ...

- లాభదాయకమైన స్థానాల కోసం పోటా పోటీ
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు కోసం విశ్వప్రయత్నాలు
- వైసీపీ పాలనలోని రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలు



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి జిల్లాలోంచి బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాకు రానున్నారు. అయితే లాభాదాయకమైన మండల కేంద్రం కోసం అక్కడి నుంచే తహసీల్దార్లు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని అవకాశం ఇవ్వాలని కోరుతూ తమకు ఫోన్ చేస్తున్నట్లు నాయకులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అయితే వైసీపీ నాయకులతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన తహసీల్దార్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

1 తేదీలోగా పింఛన్ల నగదు జమ చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: బ్యాంకర్లందరూ పింఛన్ల పంపిణీకి జూలై 1వ తేదీలోపు బ్యాంకు బ్రాంచీలకు నగదు పంపించేలా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్లు కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ ప్రైమరీ, ఎంఎస్ ఎంఈ సెక్టార్లకు రుణాలు మంజూరు చేయడంలో కొన్ని బ్యాంకు బ్రాంచ్‌లు పురోగతి సాధించడం లేదన్నారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు, నాబార్డు డీడీఎం సుబ్బరెడ్డి, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ గిరిధర్ బెహేరా, కెనరా బ్యాంకు ఆర్ఎం సుశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రాజెక్టులకు మంచి రోజులు

- అత్యవసర పనుల కోసం ప్రతిపాదనలు
- ఉమ్మడి జిల్లాకు రూ.18.50 కోట్లు అవసరం
- ప్రభుత్వానికి నివేదిక పంపిన సీఈ
- జూలై ఒకటిన ప్రాజెక్టులు, కాలువల తాజా పరిస్థితిపై మంత్రి సమీక్ష


ఎల్లెల్సీ పంట కాలువ దుస్థితి

కర్నూలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులు, పంట కాలువల మరమ్మతులపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో మెకానికల్, సివిల్ పనులకు అత్యవసరంగా ఎన్ని నిధులు కావాలో నివేదిక పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల శాఖ సీఈల నుంచి నివేదికలు కోరింది. అందులో భాగంగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.18.50 కోట్లు తక్షణ అవసరం ఉందని నివేదిక పంపించినట్లు కర్నూలు జిల్లా ఇగిరేషన్ ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా గురువారం తెలిపారు. మెకానికల్ రిపేర్ల కింద శ్రీశైలం, సంకేసులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ (బీసీఆర్), వెలుగోడు జలాశయం గేట్ల మరమ్మతులు, సివిల్ పనుల కింద జిల్లాలో ఎల్లెల్సీ, కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ.. వంటి కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, కాలువ గట్లు బలోపేతం వంటి పనులు అత్యవసరంగా చేపట్టాలని ఆ నివేదికలో పేర్కొన్నారు. తాత్కాలిక బడ్జెట్ (ఒటాన్ అకౌంట్ బడ్జెట్)లో అత్యవసర పనులకే ప్రతిపాదనలు పంపామని, శాశ్వత మరమ్మతులకు ఎన్ని నిధులు అవసరమయ్యేదీ అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు.

అలాగే.. జూలై ఒకటో తారీఖున ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రాజెక్టులు, కాలువ తాజా పరిస్థితిపై సమీక్ష (రివ్యూ) సమావేశం ఉంటుందని, ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల సమగ్ర వివరాలతో సమీక్షా సమావేశానికి హాజరై రాయలసీమ ప్రాజెక్టుల తాజా పరిస్థితిపై వివరిస్తామని తెలిపారు. అయితే.. ఐదేళ్లుగా గత జగన్ ప్రభుత్వం రాయలసీమ సాగునీటి వనరులపై పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శించింది. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం, ప్రాజెక్టుల అత్యవసరం మరమ్మతులపై దృష్టి సారించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది.

డీసీసీబీ, కేడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 27: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు జిల్లా మార్కెటింగ్ సొసైటీలకు జాయింట్ కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం జీవో.నెం.404ను జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సహకార కేంద్ర బ్యాంకులను భ్రష్టు పట్టించి రైతులకు అందించే రుణాలను పక్కదారి పట్టించారని ప్రస్తుతం అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. కొండలు, గుట్టలకు రుణాలు అందించడమే కాకుండా గొర్రెలు, పాడిగేదెలు వంటి వాటికి ఒక్కొక్కరికి రూ.లక్షల్లో రుణాలు అందించేందుకు ఆనాటి బ్యాంకు ఉన్నతాధికారులు, చైర్మన్లు అత్యుత్సాహం చూపారు. చాలా బ్యాంకుల పరిధిలో బోగస్ పేర్లతో పెద్దఎత్తున మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి రుణాలు ఇప్పించేందు కోసం సీఈవోలపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు 600 పొదుపు గ్రూపులను ఏర్పాటు చేసి ఒక్కో గ్రూపుకు రూ.లక్ష చొప్పున రుణాలు అందించాలని గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని గత ప్రభుత్వం ఆదేశాలతో పదవులు పొందిన పర్సన్ ఇన్‌చార్జిలను తొలగిస్తూ టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలక వర్గాలకు ఎన్నికలు జరిపేంత వరకు జిల్లా జాయింట్ కలెక్టర్లే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతారనీ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

హొళగుంద, జూన్ 27: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హొళగుంద మండలంలోని నెరణికి గ్రామంలో చోటు చేసుకుంది. నెరణికి చెందిన బోయ శేఖర్ (20) గ్రామంలో దినసరి కూలిగా జీవనం సాగించేవాడు. రెండేళ్ల క్రితం శ్రీదేవితో వివాహం జరిగింది. గత 15 రోజుల క్రితం శ్రీదేవి పండండి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇదిలా ఉండగా రెండురోజుల క్రితం శేఖర్ కుటుంబ సభ్యులు తెలంగాణలోని జహీరాబాద్‌కు వలస కూలీలుగా వెళ్లారు. ఈ క్రమంలో మృతుడు బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెద్దయ్య నాయుడు తెలిపారు.

గనుల శాఖ తనిఖీల్లో నాపరాయి లారీలు సీజ్

కర్నూలు(అర్బన్), జూన్ 27: గనుల శాఖ తనిఖీల్లో అక్రమంగా నాపరాయి తరలిస్తున్న 3 వాహనాలను సీజ్ చేసినట్లు డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున పుల్లూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ వాహనాలకు రూ. 70 జరిమాన విధించినట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి తదుపరి చర్యలకు ఆదేశించామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్స్‌పెక్టర్ మురహరి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్టు అందజేత



క్రీడాకారుడికి క్రికెట్ కిట్టు అందజేస్తున్న రఘురామిరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 27: కోడుమూరు తాలూకా నుంచి అండర్-16 క్రికెట్‌కు ఎంపికైన జంగాల శివయ్యకు క్రికెట్ కిట్టును పంపిణీ చేశారు. గురువారం కోడుమూరు తాలూకా అసోసియేషన్ అధ్యక్షుడు డా.రఘురామిరెడ్డి సుమారు రూ.15 వేలు విలువ చేసే క్రికెట్ కిట్టు, కీపింగ్ గ్లౌజులు క్రీడాకారుడికి అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రవిప్రసాద్, కోశాధికారి రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న జిల్లా కురువ సంఘం నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 27: సున్నిపెంటలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని గురువారం కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, సహాయ కార్యదర్శి కే.దేవేంద్ర కలిసి శాలువ, పూలబొకేతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం నాయకులు అల్లూరు వెంకటేశ్, పెద్దపాడు పుల్లన్న, పెద్దదేవులాపురం, శివప్రసాద్, వేల్పనూరు శివ, వాదాల నాగశేషులు పాల్గొన్నారు.

గోల్డెన్ నంది, గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 27: మక్ష గ్లోబెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో కర్నూలు బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఎస్.నాగస్వామి నాయక్‌కు గోల్డెన్ నంది, గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డును మాజీ స్పీకర్ మధుసూదనాచారి, టీఎస్ గ్రంథాలయ చైర్మన్ రియాజ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. మక్ష గ్లోబల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ చేరిపల్లి మాట్లాడుతూ టాలెంట్‌ను గుర్తించి ఈ ప్రపంచానికి వారి ప్రతిభను తెలియజేసేందు కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, సామాజిక రంగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గానూ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు, కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అధ్యాపకులు వైవీ రామకృష్ణకు గోల్డెన్ నంది గ్లోబెల్ ఇన్‌స్పైర్ అవార్డు అందజేసినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 27: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సూచించారు. గురువారం స్థానిక ఇండస్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్‌షాపు కార్యక్రమం జరిగింది. డీఈవో శాముయేల్ మాట్లాడుతూ అటల్ ల్యాబ్ కలిగి ఉన్న పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయులందరూ మెంటర్‌గా ఉండి విద్యార్థులను ఒక శాస్త్రవేత్తగా తీర్చిదిద్ది వారు తయారు చేసిన ప్రాజెక్టులను సైన్స్‌ఫైర్, ఇన్‌స్పైర్‌లలో జాతీయ అవార్డులు వచ్చేలా కృషి చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ మాట్లాడుతూ అటల్ స్టింకరింగ్ ల్యాబ్ పాఠశాలలకు కేటాయించిన కాలమాన పట్టిక ప్రకారం ప్రతి వారం రెండు పిరియడ్లు విద్యార్థులు కలిసి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి విల్సన్, శ్రీనివాసరెడ్డి, కింగ్ మార్కెట్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మౌలాలి, టీమ్ సభ్యులు, మెంటర్స్, అటల్ ల్యాబ్ స్పీకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 27: విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. గురువారం స్థానిక కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో డెటాల్ బనేగా ఇండియా గ్రామాలయం సార్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల నోడల్ ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులే మంచి ప్రేరణ కర్తలుగా ఉండి వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా సహాయ విద్యా పరిశీలనాధికారి డా.షేక్ రఫీ, మండల అర్బన్ ఎంఈవో విజయకుమారి, డీబీఎస్ఐ జిల్లా సమన్వయ అధికారి పుల్లన్న, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి రోడ్ సెక్షన్‌లో నేడు కరెంట్ కోత

కల్లూరు, జూన్ 27: విద్యుత్ మరమ్మత్తు పనుల్లో భాగంగా బళ్లారి రోడ్ సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో కరెంట్‌కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ ఓబులేసు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు. ఈమేరకు వీకర్‌సెక్షన్‌కాలనీ, స్కందాన్సీ వెంచర్, బోసిరెడ్డికాలనీ, బీసీ కాలనీ, లెప్రసీకాలనీ, వాసవీ హస్టల్ ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందని ప్రజలు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కలెక్టర్ రంజిత్ బాషాకు ఘనస్వాగతం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో మధుసూదన్

కర్నూలు (కలెక్టరేట్), జూన్ 27: కర్నూలు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన రంజిత్ బాషా గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయనకు జిల్లా ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో డీఆర్వో మధుసూదన్ రావు, ఆదోని సబ్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, ఆర్డీఓలు శేషిరెడ్డి, తహసీల్దారు మునివేలు తదితరులు ఉన్నారు.

నగరంలో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్‌పై దృష్టి సారించండి

● ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్ష



అర్ అండ్‌బీ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూన్ 27: నగరంలో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ కష్టాలపై ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని మంత్రి టీజీ భరత్ అదేశించారు. గురువారం ప్రభుత్వ అతిథిగృహంలో అర్ అండ్‌బీ అధికారులతో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ పై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన సర్కిల్ అయిన రాజవీహార్‌లో ట్రాఫిక్ కష్టాలు తీవ్రంగా ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందు కోసం ఆనంద్ థియేటర్ ఎదురుగా ఉన్న హంద్రీ నది బ్రిడ్జి వద్ద నుంచి వాహనాలు మళ్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ఫ్లైఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కోర్టు భవనాలతో పాటు జడ్జిల నివాసాలు ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలించి అవసరమైన మరమ్మతులు వెంటనే చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను కూడా పరిశీలించి మరమ్మతులు చేయాలన్నారు. ఇక చిల్డ్రన్స్ పార్క్ నుంచి వడ్డేగేరి, ఉస్మానియా కాలేజీ మీదుగా బుధవారపేట, కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు, దుకాణాదారులతో మాట్లాడి తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రజలు ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నగరంలో రోడ్డు విస్తరణ జరగాలని ఆదేశించారు. కర్నూలు నుంచి కల్లూరుకు వెళ్లే మార్గంలో ఉన్న పక్కిర వాగు బ్రిడ్జి నిర్మించేందుకు పరిశీలించాలన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను ఎస్‌ఏపీ క్యాంప్‌లో వచ్చే విధంగా పరిశీలించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలన్నారు. సమావేశంలో అర్ అండ్‌బీఎస్‌ఈ ఎస్ నాగరాజు, ఈఈలు సురేష్‌బాబు, క్రిష్టారెడ్డి, డీఈలు నాగరాజు, శివరుద్ర, రవిచంద్ర, వెంకటేశ్వర్లు, ఫణిరాజు, సుజాత, రుక్మిణి, అధికారులు పాల్గొన్నారు.

మట్టి నుంచి మాణిక్యాలు తీసిన
గొప్ప కృషీవలుడు రామోజీరావు

- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



రామోజీరావు సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(కల్చరల్), జూన్ 27: మట్టి నుంచి మాణిక్యాలు సృష్టించిన గొప్ప కృషీవలుడు రామోజీరావు అని, స్వశక్తితో అత్యున్నత శిఖరాలకు ఎదిగిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా రామోజీరావు చరిత్రలో నిలిచిపోతారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కొనియాడారు. గురువారం నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డినగర్‌లోని నగరూరు రాఘవేంద్ర బ్యాంకెట్ హాల్లో దివంగత ఈనాడు గ్రూప్స్ అధినేత సీహెచ్ రామోజీరావు సభను నిర్వహించారు. ఫోటో, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకరశర్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర, మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ నగరూరు శమంతకమణి, న్యాయవాదుల సంఘం కార్యదర్శి రవికాంత్, బీసీ చైతన్య సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషఫణి తదితరులు హాజరయ్యారు. ఈ సభలో వక్తలు తొలుత రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ తెలుగు వారి ఘనతను పత్రికారంగంలో, సినీ రంగంలో చాటి చెప్పిన ఘనత రామోజీరావుకు దక్కుతుందని అన్నారు. డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రామోజీరావు తెలుగు వారికి కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెట్టడంలో ఎనలేని కృషి చేశారని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మ విశ్వాసంతో ఆయన ఈనాడు దినపత్రిక, ఈటీవీ ఛానెల్స్, రామోజీ ఫిల్మ్‌సిటీ వంటివి సృష్టించి వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించిన పారిశ్రామిక కృషీవలుడని కొనియాడారు. నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ రామోజీరావు తన స్వశక్తితో అత్యున్నత శిఖరాలను దాటి విజేతగా నిలిచారని అన్నారు. డాక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ రామోజీరావు ఏ రంగంలో కాలుమోపినా దానికి ఒక ప్రత్యేకతను తీసుకువచ్చారని అన్నారు. శమంతకమణి మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత వరకు రామోజీరావు గుర్తుండిపోతారని, పత్రికాధిపతిగా ఆయన జాతికి చేసిన సేవలు మహోన్నతంగా నిలుస్తాయని అన్నారు.

మంచికి మారుపేరు గౌరు చరిత కుటుంబం

● గౌరు దంపతులను సన్మానించిన సినీ నటుడు రాజ్‌కుమార్



గౌరు దంపతులను సన్మానిస్తున్న సినీనటుడు రాజ్‌కుమార్

కల్లూరు, జూన్ 27: మంచికి మానవత్వానికి ఎమ్మెల్యే గౌరుచరిత కుటుంబం మారుపేరని సినీనటుడు రాజ్‌కుమార్ కొనియాడారు. గురువారం మాదవీనగర్‌లోని పాణ్యం ఎమ్మెల్యే నివాసంలో ఆయన గౌరు దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరానికి విచ్చేసిన సినీనటుడు రాజ్‌కుమార్ గౌరు దంపతులతో ముచ్చటించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని గౌరు దంపతులకు అందజేశారు.

● **కల్లూరు ఫొటో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో సన్మానం:** పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలను కల్లూరు ఫొటో గ్రాఫర్స్ యూనియన్ నాయకులు, టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం ఆమె స్వగృహంలో గౌరు దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితమ్మను అభినందించారు. టీడీపీ నాయకులు పవన్‌కుమార్, పోలిరెడ్డి, ఫొటో గ్రాఫర్లు నాగరాజు, రాఘవేంద్ర, రఘురాం, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

'సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు అందించాలి'

- అలరించిన దక్షిణ ఆంధ్ర సంభాగ్ కళాకారుల ప్రదర్శనలు



అతిథులతో సత్కారం అందుకున్న వివిధ ప్రాంతాల కళాకారులు

కర్నూలు(కల్చరల్), జూన్ 27: దేశ సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని, ఆదిశగా కృషి చేస్తున్న దక్షిణ ఆంధ్ర సంభాగ్ కళాకారులు అభినందనీయులైని విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని, దక్షిణ ఆంధ్ర సంభాగ్ సంస్థ ఆధ్వర్యంలో 'ఏ కల్ అభియాన్ - ఏ కల్ గ్రామ సంఘటన్' పేరుతో సాంస్కృతిక మేళా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో దేశభక్తి, ధార్మిక భావనలు పెంచే నృత్య రూపకాలు ప్రదర్శించారు. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గ్రామీణ జానపద కళారూపాలను ప్రదర్శించి ప్రేక్షకులకు వీనుల విందు, కనుల పసందుగా రంజింపజేశారు. కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో దేశభక్తిని పెంచే ఇలాంటి ప్రదర్శనలు యువతకు ఎంతో అవసరమని తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ దక్షిణ ఆంధ్ర సంభాగ్ కళాకారుల ప్రదర్శినలన్నీ వేటికవే పోటీ పడ్డాయని, ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు మరిన్ని చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఆంధ్ర సంభాగ్ కళాకారుల ప్రదర్శనలు కళాక్షేత్రంలో ఏర్పాటు చేయడం స్పూర్తిదాయకంగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ కళాకారులను అభినందిస్తూ సత్కార శాలువలను పంపించారని తెలిపారు. అలాగే ఆయన ఫోన్ ద్వారా కళాకారులందరికీ ఆశీస్సులు తెలియజేశారని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు బసవన్న గౌడ్, డి. సుకుమార్‌లతో పాటూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఏ కల్ పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సత్కరించారు. కళారూపాల్లో డిల్లీకి చెందిన అభియాన్ కళాకారుల 'శ్రీకృష్ణ' కళారూపకం, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన కరుణా ఠాగూర్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'గిరిజన నృత్యాలు', వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారుల దేశభక్తి, సంప్రదాయ గిరిజన నృత్యాలు ప్రేక్షకులను అలరింపజేశాయి.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 27: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 117 జీవోల ద్వారా 3, 4,5 తరగతులు విలీనం చేయడం, 1, 2 తరగతుల విద్యార్థులకు ఒక టీచరుతో బోధన చేయించడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. 1 నుంచి 5 తరగతులు ఉన్న సమీపంలో పాఠశాలల వైపు చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. 117 ఉత్తర్వులను రద్దు చేసి వెంటనే 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోకి తరలించాలని వారు కోరారు.

హాస్టళ్ల వసతులు కల్పించాలి

జూనియర్ కళాశాలల్లో చేరిన విద్యార్థులందరికీ ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రవేశాలు కల్పించాలని నంద్యాల జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి డా.కె.చెన్నయ్య గురువారం తెలిపారు. హాస్టళ్లో వసతి లేదని కళాశాలల్లో అడ్మిషన్లు పొందకుండానే తిరిగి వెళ్లిపోతున్నారని తెలిపారు.

ల్యాప్‌ట్యాబ్ చోరీ

కర్నూలు, జూన్ 27: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కళాశాల విద్యార్థికి చెందిన ల్యాప్‌ట్యాబ్ చోరీకి గురైంది. అనంతనాగ్ అనే విద్యార్థి పీజీ సెకండియర్ చదువుతున్నాడు. క్యాజువాల్టీలో విధుల్లో భాగంగా టేబుల్‌పై ల్యాప్‌ట్యాబ్ పెట్టి లోపలికి వెళ్లాడు. వచ్చిన తర్వాత ల్యాప్‌ట్యాబ్ కనిపించలేదు. దీంతో పోలీసులకు పిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, జూన్ 27: ఉలిందకొండ, వెల్దుర్తి రైల్వేస్టేషన్‌ల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 55 ఏళ్లు ఉంటుందని పోలీసులు బావిస్తున్నారు. శరీరంపై నీలం కలర్, అడ్డం నిలువు గీతల చొక్కా, పింక్ కలర్ నీలం కలర్ కలిగిన గీతలో ఉన్న పంచ ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు తెలిపారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ

కర్నూలు(న్యూసిటీ), జూన్ 27: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నూతన ఎన్డీయే ప్రభుత్వం పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికులందరకీ సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు నగర అధ్యక్షుడు నరసింహులు, ఖాజాపాష, అబ్దుల్లా, ఈశ్వరమ్మ, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో పంటపొలాలను నష్టం చేస్తున్న జింకల బెడద నుంచి రైతులను కాపాడాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామక్రిష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, పత్తికొండ, ఎమ్మిగనూరు. నందవరం, గోనెగండ్ల, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో వేలాది జింకలు పంట పొలాల్లో కనబడిన మొలకలన్నింటిని తినివేసి రైతులకు తీవ్రమైన నష్టం చేస్తున్నాయని అన్నారు. జింకల బారి నుంచి రైతాంగాన్ని ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● నగరంలోని మూడవ వార్డులో మరమ్మత్తుల పేరుతో మరుగుదొడ్లకు తాళాలు వేయడం సరికాదని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఎస్ఎండీ.షరీఫ్ అన్నారు. బండిమెట్టలో తాళాలు వేసిన మరుగుదొడ్లను సీపీఎం బృందం పరిశీలించారు. మహిళలకు ఇబ్బందికరమైన సామూహిక మరుగుదొడ్లకు తాళాలు వేయడం సరికాదన్నారు. తక్షణమే అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్షావలి, గౌస్‌బాషా, రాజు ఉన్నారు.

మెగా డీఎస్సీపై సంతకం పట్ల హర్షణీయం

కర్నూలు(అర్బన్), జూన్ 27: మెగా డీఎస్సీ ఫైలుపై సీఎం చంద్రబాబు సంతకం చేయడం హర్షణీయమని జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు అన్నారు. గురువారం గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పక్ష నేతగా రాహుల్ రాకతో బీజేపీలో వణుకు

కర్నూలు(అర్బన్), జూన్ 27: ప్రతి పక్ష నేతగా రాహుల్ నియామకంతో బీజేపీలో వణుకు మొదలైందని కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జీ రాంపుల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో నుంచి ఒక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కొత్తగా కొలువుదీరిన, ఎన్డీఏ ప్రభుత్వంలో పార్లమెంట్ ప్రతి పక్ష నేతగా ఎన్నికల కావడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

ఓర్వకల్లు, జూన్ 27: ఇంటి వద్దకే పింఛన్ డబ్బులు అందజేస్తామని ఎంపీడీవో మల్లేశ్వరి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 1న సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛన్ ఉదయం 6 గంటలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎవరూ సచివాలయం వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. కొన్ని వాట్సాప్ గ్రూపులలో పింఛన్ తీసుకోవాలంటే కులం సర్టిఫికెట్ దరఖాస్తు చేసుకోవాలని వివిధ గ్రూపులలో పుకార్లు వస్తున్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

రాష్ట్ర పురపాలక మంత్రి సమీక్షకు కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 27: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగే అధికారుల సమీక్షకు నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవతేజ, ఇంజనీరింగ్ అధికారులు హజరుకానున్నారు. దయేరియా, కార్పొరేషన్ ఆర్థికస్థితి వంటి వివిధ అంశాలపై మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, విభాగాల అధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు.

పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(న్యూసిటీ), జూన్ 27: కర్నూలు డివిజన్ పరిధిలోని తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లు, ఫీల్డ్ ఆఫీసర్లుగా కమీషన్ ప్రాతిపదికన పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్ధన్‌రెడ్డి గురువారం తెలిపారు. కర్నూలు డివిజన్‌లోని పలు ప్రాంతాలలో కమీషన్ పద్ధతిన డైరెక్ట్ ఏజెంట్స్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. డైరెక్ట్ ఏజెంట్లు 10వ తరగతి పాసై 18 సంవత్సరాలు దాటిన వారు, ఫీల్డ్ ఆఫీసర్స్‌కు సెంట్రల్/రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి అయి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 10న పాతబస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపిక చేసిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో(రీఫండబుల్) చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఏజెంట్లకు కమీషన్ ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు డెవపల్‌మెంట్ ఆఫీసర్ జి.హరిక్రిష్ణారెడ్డి 7013029312కు సంప్రదించాలన్నారు.

క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 27: ప్రజలు క్యాన్సర్ వ్యాధిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయరాదని డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూలెక్చరర్ గ్యాలరీలో గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్ మూడవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ముఖ్యఅతిథిగా పాల్గొన్ని ప్రసంగించారు. స్త్రీలలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నారనీ, క్యాన్సర్‌ను ప్రాతమిక దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చునన్నారు. కలుషిత ఆహారం, ధూమపానం, మద్యపానం క్యాన్సర్‌గా ప్రధాన కారణాలుగా చెప్పవచ్చునన్నారు. పొగాకు ఏ రూపంలో వాడిన, నోటి క్యాన్సర్ వస్తుందన్నారు. నోటిలో వాపు, తెల్లగా, ఎర్రగా వచ్చిన మచ్చలు ఉన్న ముక్కు నుంచి నోటి నుంచి రక్తం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు, జంక్‌ఫుడ్ కల్తీ ఆహారం కారణంగా అన్నవాహిక క్యాన్సర్ పేగుల్లో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. శిక్షణలో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత, వైద్యులు డా.శైలేష్ కుమార్, డా.సాహితి జయరాం, డా.పుష్పలత, డా.మంజూషా, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులు, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

అంధకారంలో పెద్దాసుపత్రి

● చీకట్లో పీజీ క్వాటర్స్ ● 5 గంటలు అవస్థలు



అర్ధరాత్రి సబ్ స్టేషన్‌లో కరెంటు సమస్యను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 27: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అర్ధరాత్రి అంధకారం నెలకొంది. కేబుల్ ప్యానెల్ తాకడంతో షాట్ సర్క్యూట్ జరిగి గురువారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు కరెంటు నిలిచిపోయింది. దీంతో గ్యాస్ట్రో ఎంట్రాలజి, సర్జికల్, ట్రామకేర్, మెడికల్, టీబీ వార్డుల్లో 5 గంటలు అంధకారం నెలకొంది. జనరేటర్ కూడా మొరాయించడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఆసుపత్రిలో తరుచూ విద్యుత్ అంతరాయం, షార్ట్ సర్క్యూట్ జరుగుతున్నా ఆసుపత్రి అధికారులు గానీ, కలెక్టర్ గానీ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

● అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగిందన్న విషయం తెలుసుకున్న వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు అక్కడే ఉండి విద్యుత్ సమస్య నివారణకు కృషి చేశారు. 5 గంటలు ఎలక్ట్రిషన్లతో చర్చించి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేసిన తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్ తెల్లవారుజామున ఇంటికి వెళ్లారు.

కొళాయిల చోరీపై ఆగ్రహం

● సెక్యూరిటీ ఏఎస్‌వోకు మెమో జారీ చేసిన సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 27: రెండు రోజుల క్రితం రూ.12 కోట్ల తో నిర్మించిన న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ బాత్ రూమ్‌లోని కొళాయిలు చోరీకి గురికావడంపై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి సెక్యూరిటీ గార్డులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన పలు విభాగాల్లో రౌండ్లు నిర్వహించారు. ఇటీవల కాలంలో దొంగలు, వార్డుల్లో చొరబడి బాత్‌రూమ్, స్టీల్ కొళాయిలను దొంగతనం చేస్తున్నా సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారని సెక్యూరిటీ ఏఎస్‌వోపై మండిపడ్డారు. దీనిపై ఏఎస్‌వోకు మెమో జారీ చేశారు. న్యూరోసర్జరీ విభాగంలో ఫ్లోర్ టైల్స్ శిథిల వ్యవస్థకు చేరినా వాటిని మరమ్మతులు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈని ఆదేశించారు. ఈఎన్‌టీ వార్డులో వీల్‌చైర్, ట్రాలీల కొరత ఉందని, గుర్తించి త్వరలో వాటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

రాష్ట్ర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నిక

● రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలు నాయక్ ● రాష్ట్ర కార్యదర్శిగా అబ్రహాం




గుంటూరులో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బాలు నాయక్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 27: 18వ ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు గురువారం గుంటూరులో జరిగాయి. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన బాలు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రాష్ట్ర కార్యదర్శిగా అబ్రహం, స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఖాజామొయిద్దీన్, సురేష్ ఎన్నికయ్యారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్‌లో రాష్ట్ర కమిటీకి ఎన్నికైనందుకు సభ్యులను అభినందించారు.

వానమ్మా.. రావమ్మా !

- చినుకు రాలదు... రైతన్నకు కునుకుపట్టదు..
- ఈదురుగాలులకు ఎండుతున్న పంటలు
- ఎమ్మిగనూరులో సాగుకావాల్సింది 69172 హెక్టార్లు సాగయ్యింది 25వేల హెక్టార్లు మాత్రమే

రైతులు ఆకాశం వైపు చూస్తూనే ఉన్నారు.. మేఘాలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి. 15 రోజులుగా చినుకు రాలకపోవడంతో రైతుల్లో దిగులు మొదలైంది. మొదట ఊరించిన వరణుడు ఇప్పుడు దోబూచులాడుతున్నాడు. ప్రారంభంలో కురిసిన వర్షాలకు సాగు చేసిన పంటలు ఇప్పుడు చినుకు రాలకపోవడంతో ఈదురుగాలులకు, ఎండవేడిమికి ఎండుముఖంపడుతున్నాయి. దిక్కుతోచక రైతన్న వానమ్మా.. ఇటు రావమ్మా అంటూ మొరపెట్టుకొంటూ ఆకాశానికేసి చూస్తున్నారు.



ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్న దృశ్యం

గోనెగండ్ల, జూన్ 27: ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు కష్టంగా కనిపిస్తోంది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఊరించిన మేఘాలు ఆరగంటలో ఊసురుమంటున్నాయి. సాగు చేసిన పంటలు వర్షం కురియక పోవడంతో ఈదురుగాలులకు, ఎండవేడిమికి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో అప్పులు చేసి పెట్టబడులు పెంటి పంటలు సాగు చేసిన రైతన్న ఆవేదన చెందుతున్నాడు.

గోనెగండ్ల మండలంలో 4600 హెక్టార్లలో కంది, ఉల్లి, పత్తి, వేరుశనగ, ఆముదం, సజ్జ, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. జూన్ నెలలో వర్షం కురిసినప్పటికీ రెండు రోజులలో నెల అంత కురియాల్సిన వర్షం కురియడంతో పంటలు ఎండి పోతున్నాయి. పంట సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో సాధారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 69172 హెక్టర్లు పంటలు సాగు కావాల్సి ఉంది. అయితే, వర్షం సకాలంలో కురియక పోవడంతో నియోజకవర్గంలో కేవ లం 25వేల హెక్టార్లు మాత్రమే పంటలు సాగయ్యాయి. ఏప్రిల్ నెలలో 13.8 ఎంఎం వర్షపాతం కురియాల్సి ఉండగా ఒక్క చుక్క రాలలేదు. మే నెలలో 26 ఎంఎం కురియాల్సి ఉండగా 165 ఎంఎం అధికవర్షపాతం నమోదయ్యింది. ఇక జూన్ నెలలో 79.5 ఎంఎం వర్షం కురియాల్సి ఉండగా ఈ నెల మొదటి వారంలో రెండు రోజుల్లోనే 94 ఎంఎం వర్షం కురిసింది. దాదాపు 20 రోజులుగా వర్షం కురియక పోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోవడం కొత్త పంటలు సాగుచేసేందుకు పదును కాకపోవడంతో రైతన్న వర్షం కోసం ఆకాశంవైపు ఆశగా చూస్తున్నాడు. నైరుతి రుతుపవనాలు వచ్చినా.. చినుకు రాలకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రతి రోజూ సాయంత్రం ఆకాశం కారుమబ్బులు కమ్ముకోవడం.. కొద్ది సేపటికి నీలంగా మారిపోవడం సర్వసాధరం అయిపోయింది. జూన్ నెలలో రెండు రోజులు మాత్రమే వర్షం కురిసింది. ఆ తరువాత ఒక్క వర్షం కూడా పెద్దగా కురియలేదు. ఆదోని డివిజన్ లో ఎక్కువ భాగం వర్షాధార భూములే. వర్షం కురిస్తేనే రైతులు పొలాల్లో పనులు చేసేది. ఇంకా మండలంలోని పలు గ్రామాల్లో విత్తనం వేసేందుకు పొలంను దుక్కి దున్ని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

వర్షం కురవక పోతే ఇక అంతే

నాలుగు ఎకరాల్లో వేరుశనగ, ఉల్లి, పత్తి పంటలను సాగు చేశా. విత్తనం విత్తి వారం రోజులు గడుస్తోంది. ఈదురు గాలులు ఎక్కువగా ఉండటంతో పొలంలోని తేమ ఆరిపోతోంది. ఎండ వేడిమి కూడా పెరుగుతోంది. ఈ వారంలో వర్షం కురియక పోతే పొలంలోని విత్తనాలు చీమలు తిని ఎండిపోతాయి.

- బడేసానాయుడు, రైతు గోనెగండ్ల.

భూమిలో ఎండ వేడిమి తగ్గలేదు

గతంలో కురిసిన వర్షాల వల్ల అప్పట్లో భూమి చల్లబడినట్లు కనిపించిందేకానీ.. వాస్తవానికి భూమి చల్లబడలేదు. అప్పట్లో కురిసిన వర్షాల వల్ల భూమి పదును అయ్యింది. మరో వారం రోజుల్లో వర్షాం కురియక పోతే ఇప్పటి వరకు సాగుచేసిన విత్తానాలు ఎండి పోతాయి.

- చెన్నలరాయుడు. రైతు గోనెగండ్ల

సమయం ఉంది ఆందోళన చెందొద్దు



సరైన యాజమాన్య పద్దతుల ద్వారా ఆగస్టు నెల 15వరకు కందిని సాగు చేసుకోవచ్చు. మొక్క జొన్న పంటను జూలై 15వరకు సాగు చేసుకొవచ్చు, పెసర, మినుములను జూలై 15వరకు, ఆరుతడి పంటలైన ఆముదాలు, పొద్దుతిరుగుడు ఉలువలు, జూలై 31 వరకు సాగు చేసుకోవచ్చు. ఇంకా సమయం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఖాద్రీ, ఏడీఏ ఎమ్మిగనూరు

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పోరాటం ఆగదు

ఆలూరు, జూన్ 27: ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల గాదిలింగ అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వచ్చే నెల 7న హలో మాదిగ చలో వరంగల్ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయ నేతలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ మండల, గ్రామాల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు చలో వరంగల్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలూరు మండలం అధ్యక్షుడు చెన్నంగి రాజశేఖర్, సీనియర్ నాయకులు ఆలూరు సుధాకర్, హొళగుంద, చిప్పగిరి, హాలహర్వి అధ్యక్షులు హెబ్బటం పక్కిరప్ప, జీయస్ నెట్టే కంటయ్య, మల్లయ్య, డివిజన్ నాయకులు గంగాధర్, మల్లి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

పెద్దకడుబూరు, జూన్27: మండలంలోని ప్రైవేటు పాఠశాలలను ఎంఈవో సువర్ణసునియం గురువారం తనిఖీ చేశారు. పెద్దకడుబూరు, కల్లుకుంట గ్రామాల్లోని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. మొద టి తరగతిలో ఎంతమంది విద్యార్థులు చేరారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

లారీ బాడుగ సమస్యను పరిష్కరించాలి



ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి విన్నవిస్తున్న వేరుశనగ వ్యాపారులు

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 27: వేరుశనగ లారీ అధికంగా బాడుగ అవుతోందని, సమస్యను పరిష్కరించాలని వేరుశనగ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శరణప్ప తాతయ్య మల్లికార్జున కోరారు. గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకల్ లారీ అసోసియేషన్ ద్వారా వేరుశనగ బస్తాలను ఎగుమతి చేయాలంటే అధికంగా లారీ బాడుగను డిమాండ్ చేస్తున్నారన్నారు. బయటి లారీలను అద్దెకి తెచ్చుకుంటే రూ.5వేలకు తక్కువ దొరుకుతుందని అయితే వాటిని లారీ అసోసియేషన్ అడ్డుకుంటుందని ఫిర్యాదు చేశారు. పోటీ వ్యాపారంలో తమకు లారీ అధిక బాడుగ వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లారీ అసోసియేషన్‌తో చర్చించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉపాధి పథకంతో రైతులకు లబ్ధి : డ్వామా పీడీ

ఆలూరు రూరల్, జూన్ 27: ఉపాధి హామీ పథకం ద్వారా సన్న చిన్న కారు రైతులు లబ్ధి పొందాలని డ్వామా పీడీ అమరనాథరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఉపాధి హామీ పథకంపై ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న సన్నకారు రైతులకు పండ్లతోటల పెంపకానికి ప్రోత్సహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడి పద్మావతి ప్లాంటేషన్ మేనేజర్ నందకిషోర్ కోర్సుడైరెక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

దేవనకొండ ,జూన్ 27 : స్థానిక సీఎల్‌ఆర్సీ భవనంలో పత్తికొండ క్లస్టర్ స్థాయిలో ఉపాధి సిబ్బందితో పీడీ అమరనాథరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. పండ్లతోటలపై రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ తెలియజేసి సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఎపీడి పక్కీరప్ప, ప్లాంటేషన్ మేనేజర్ నందకుమార్ పాల్గొన్నారు.

పశువైద్యశాలలో జేడీ ఆకస్మిక తనిఖీ

వెల్దుర్తి, జూన్, 27 : పట్టణంలోని పశువైద్యశాలను పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొర్రెలకు వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేస్తున్నామన్నారు. కుక్కలకు రేబిస్ టీకాను జూలై 6న ప్రత్యేకంగా వేస్తున్నామన్నారు. పంచాయతీ పరిధిలోని కుక్కలతోపాటు, కుక్కల పెంపకం చేపడుతున్న యజమానులు టీకాలు వేయించాలన్నారు. రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు పశువైద్యాధికారి శాంతలత, కర్నూలు పశువైద్యశాఖ మేనేజర్ జవహర్, స్టాటిస్టికల్ అధికారి క్రిస్టఫర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

గోనెగండ్ల, జూన్ 27: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేజర్ పంచాయతీ సర్పంచు హైమావతి, కార్యదర్శి సతీష్ కోరారు. మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఒకటవ సచివాలయం పరిధిలో మెదడు వాపు వ్యాధి నమోదు కావడంతో వైద్యఆరోగ్య శాఖ అధికారులు పర్యటిస్తు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం గోనెగండ్లలో పర్యటించారు. మురికి నీరు నిలువ ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు గాను దోమల నివారణ మందును పిచికారి చేయించారు.

సచివాలయానికి రంగులు

తుగ్గలి, జూన్ 27 : టీడీపీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వచ్చే నెల నుంచి పంపిణీ కానున్నాయి. దీంతో వెలవెలబోయిన సచివాలయాలకు రంగులు వేస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకలు అప్పా వేణుగోపాల్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లిలో గ్రామ సచివాలయానికి నూతన రంగులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయాలకు వారి బొమ్మలు, రంగులు వేసుకోవడం దారుణమన్నారు. కొన్ని సచివాలయాలకు రంగులు కూడా వేయలేదన్నారు. ముఖ్యంగా ఉప్పర్లపల్లి సచివాలయానికి రంగులు లేక వెలిసిపోయిందని, సొంత నిధులతో సచివాలయానికి రంగులు వేస్తున్నామని చెప్పారు. టీడీపీ నాయకులు మనోహర్, ఈశ్వరప్ప తదితరులు ఉన్నారు.

8 నుంచి ఏఐఎస్ఎఫ్ రాజకీయ శిక్షణ తరగతులు

వెల్దుర్తి, జూన్, 27 : ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు జూలై 8,9,10 తేదీల్లో కాకినాడలో నిర్వహిస్తున్నామని, మండలంలో ఉన్న కళాశాల విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజరై జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సోమన్న అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు.

రైతులకు పంటనష్ట పరిహారం చెల్లించాలి : సీపీఎం

ఎమ్మిగనూరు రూరల్, జూన్27: కరువు మండలాల్లోని పంటనష్ట పరిహారం రైతులకు తక్షణమే చెల్లించాలని ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యన్న మాట్లాడుతూ 20198-19లో 42మండలాల్లో కరువు బృందం పర్యటించిందన్నారు. అప్పటి సీఎం చంద్రబాబునాయుడు పంటనష్ట పరిహారం కింద రూ.550.46కోట్లను విడుదల చేసిందన్నారు. ఆ సమయంతో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పరిహారం నిలిపివేశారని పేర్కొన్నారు.. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రైతులకు పరిహారం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ప్రస్తుతం సీఎంగా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టారని అప్పటి పరిహారాన్ని రైతుల ఖాతాల్లోకి జమచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు, నాయకులు బాబు, ఏఐకేఎంఎస్ నాయకులు పెద్దారెడ్డి, శివరామరాజు, రాజేష్, ఈరన్న, తిమ్మప్ప, నరసింహులు, చిన్న, రంగస్వామి, మల్లేషప్పలు పాల్గొన్నారు.

20 పందులను అపహరణ

కోసిగి, జూన్ 27: బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ బొలేరో వాహనంలో వచ్చిన దొంగలు కోసిగిలోని 6వ వార్డు నాడిగేని కాలనీలో ఉన్న 20 పందులను ఎత్తుకెళ్లినట్లు పందుల యజమాని ఎరుకల లక్ష్మన్న తెలిపాడు. గతంలో కూడా ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయని, బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బొలేరో వాహనంలో వచ్చిన దొంగలు 20 పందులకు పైగా వాహనంలో ఎక్కించి అపహరించుకుకెళ్లారని తెలిపారు. కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులకు అనుమతి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 27: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి అదనంగా కొత్త కోర్సులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివారెడ్డి, ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో వారుమాట్లాడారు. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేసిందని మొదటి బ్యాచ్ బీఏ (ఎకనామిక్స్), బీకాం (జనరల్), బీఎస్సీ (బోటనీ) కోర్సు పూర్తయింది అన్నారు. వీటితో పాటు ఈ ఏడాది అదనంగా బీకాం (కంప్యూటర్స్ అప్లికేషన్), బీఎస్సీ (కంప్యూటర్స్ సైన్స్), బీఎస్సీ (మ్యాథ్స్) కోర్సులకు అనుమతి లభించాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు మొదటి ఏడాది డిగ్రీలో ప్రవేశాలకు కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు గందరగోళం అపోహలు సృష్టిస్తున్నారని వారి మాటలు నమ్మొద్దని పేర్కొన్నారు. ప్రతి సబ్జెక్టుకు నైపుణ్యత కలిగిన అధ్యాపకుల చేత విద్యాబోధన ఉంటుందన్నారు. నామమాత్రపు ఫీజు చెల్లించి కళాశాలలో చేరవచ్చన్నారు. లక్షలు ఆదాయం ఉన్న వారికి ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వ ం నుంచి వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆదోని పట్టణంలో కేవలం ఒక్కటే ఉందని, అది వైఎంకే స్కూల్ భవనంలో ఉందని విద్యార్థులు గుర్తించుకోవాలని సూచించారు. వివరాలకు కళాశాలలో హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్‌బీ ఎస్ఐకి ఉత్తమ అవార్డు అందజేసిన ఎస్పీ



ఎస్పీ నుంచి అవార్డును అందుకుంటున్న ఎస్ఐ వేణుగోపాల్‌రాజు

మంత్రాలయం, జూన్ 27: ఎన్నికల్లో మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో విశేషంగా సేవలు అందించిన ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఉత్తమ పురస్కార అవార్డు అందుకున్నారు. గురువారం ఎస్పీ కృష్ణకాంత్ కార్యాలయంలో అడిషినల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ అడిషినల్ ఎస్పీ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో వేణుగోపాల్‌రాజుకు ప్రశంసాపత్రం, శాలువ, జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. 2024 ఎన్నికల్లో నిఘా విభాగంలో మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల నుంచి క్రియాశీలకంగా పని చేసి మంచి గుర్తింపు పొందారని ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారు. ఈ సందర్భంగా మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్యపోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొనసాగిన పంచాయతీ వేలం పాట

- బండిమెట్ట వేలం వాయిదా

కౌతాళం, జూన్ 27: పంచాయతీకి ఆదాయ వనరుల కోసం హల్విలో పాటు కౌతాళం మేజర్ పంచాయతీకి వివిధ రకాల వేలం పాటలు గురువారం నిర్వహించారు. ఆదోని డీఎల్పీఓ నూర్జహన్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శి గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలాల్లో కొంతమంది పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో కొన్ని వాయిదా వేశారు. హల్వి గ్రామ బండిమెట్ట వేలం పాటకు నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన కురువ నాగేష్ రూ.4.71లక్షలకు సొంతం చేసుకోగా, వారపు సంతను కే మారెన్న 14,500 సొంతం చేసుకున్నారు. కౌతాళం పంచాయతీకి తొమ్మిది నెలలకు నిర్వహిస్తుండటంతో బండిమెట్టకు అధికారులు ప్రభుతం నిర్దేశించిన రూ.3.41లక్షలు తెలుపగా పాటదారులు ఎవరు ముందుకు రాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేశారు. కమేళాను ఎరిగేరి నబమ్మ రూ.33 వేలకు సొంతం చేసుకున్నారు. ఈ వేలం పాటలు జూలై 1 2024 నుంచి మార్చి 30, 2025 వరకు అమలులో ఉంటుందని డీఎల్‌పీఓ తెలిపారు. వాయిద పడ్డ వేలం పాటలను శుక్రవారం తిరిగి నిర్వహిస్తామని తెలిపారు. ఈఓపీఆర్డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు శివయ్య, కరీం, యోగేశ్వరరెడ్డి, మంజునాథ, గ్రామ సర్పంచులు పాల్‌దినకరన్, క్రాంతి పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్నాం



వీరభద్ర గౌడ్‌ను సన్మానిస్తున్న టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్

ఆలూరు, జూన్ 27: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేరుస్తానరని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, వితంతువులకు పెన్షన్‌లను రూ.3వేల నుంచి 4వేలకు పెంపుదల చేయడమే కాకుండా అదనంగా మరో రూ.3వేలు పెంచి మొత్తం రూ.7వేలు జూలై 1నా సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వచ్చి పంపిణీ చేస్తారన్నారు. అలాగే నిరుద్యోగులకు డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని నెలాఖరులో నోటీఫికేషన్ జారీ చేసి డిసెంబర్ 10 నాటికి నియామక ఉత్తర్వులు ఇస్తారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రభుత్వ పాలనలో మార్పు చూపుతూ ప్రక్షాళన చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అక్రమాలను ఎండగడుతున్నాడన్నారు.

మార్కెట్ల వేలాలు వాయిదా

ఆదోని టౌన్, జూన్ 27: పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాబు కూరగాయలు మార్కెట్‌తో పాటు పశువుల సంత, గొర్రెల సంతల 2024-2025 సంవత్సరానికి సంబంధించి 27వ తారీఖున వేయాల్సిన వేలాలను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. తిరిగి వేలాలను నిర్వహించే తేదీను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుగ్గలి, జూన్ 27: మండలంలో విద్యుత్ మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. తుగ్గలి, జొన్నగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. మండలంలో కురుస్తున్న గాలి, వాన, ఉరుములు, మెరుపులకు నల్లరేగడి పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, విద్యుత్ తీగలు వేలాడడం వంటి సమస్యలు ఉన్నాయని వాటిని మరమ్మతులు చేయడం కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సర్దుబాటు పేరుతో ప్రాథమిక విద్యను బలి చేయొద్దు

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 27: ఉపాధ్యాయ సర్దుబాటు పేరుతో ప్రాథమిక విద్యావ్యవస్థను బలి చేయొద్దని మున్సిపాలిటీ టీచర్స్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండగిరి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎఫ్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నివారించడానికి ప్రాథమిక పాఠశాలలో జీవో 117,218లకు విరుద్ధంగా అధిక సంఖ్యలో మిగులు ఉపాధ్యాయులను గుర్తించడానికి విద్యాశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాల వల్ల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. నిబంధనల మేరకే మిగులు ఉపాధ్యాయులను గుర్తించి సర్దుబాటు చేయాలని కోరారు.

స్వర్ణ పల్లకీలో రాఘవేంద్ర స్వామి దర్శనం

మంత్రాలయం, జూన్ 27 : రాఘవేంద్రస్వామి స్వర్ణ పల్లకీలో భక్తులకు దర్శనమిచ్చారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకీలో అధిష్ఠించి వైభవంగా ఊరేగించారు. ఒంగోల్ టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పాల్గొన్నారు.

కిక్కిర్సిన భక్తులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడి గా మారింది. రాఘవేంద్ర స్వామికి ఇష్టమైన దినం గురువారం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వే లాది మంది భక్తులు తరలిరావడంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు : కర్ణాటక రాష్ట్ర పశుసంవర్ధక, సెరికల్చర్ శాఖ మంత్రి వెంకటేష్, ఒంగోల్ టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు.

అప్రెంటిస్ విధానం లేకుండా డీఎస్సీని ప్రకటించాలి : కరెక్కృష్ణ

నందవరం, జూన్ 27: అప్రెంటిస్ విధానం లేకుండా రాష్ట్రంలో డిఎస్సీ ప్రకటించాలి డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెక్కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ముగతి, నందవరం, గంగవరం, నాగలదిన్నె, ఇబ్రహింపురం, గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను, యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రాథమిక విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిన 117 జీవోను రద్దు చేయాలన్నారు. అప్రెంటిస్ విధానం లేకుండా డీఎస్సీ నోటిఫికేన్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశప్ప, వెంకటాచలం, మాధవగౌడు, రాజేంద్ర, జయన్న, మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరు రూరల్, జూన్27: ఎమ్మిగనూరు పురపాలక సంఘం సాధారణ సమావేశం శుక్రవారం చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ గంగిరెడ్డి గురువారం తెలిపారు. మొదటి సారి నిర్వహించే ఈ సమవేశంలో పట్టణంలో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు చర్చిస్తారో.. లేక అజెండాలోని అంశాలను తూతూ మంత్రంగా చదివి ఆమోదిస్తారో చూడాలి.

కార్యకర్తలకు అండగా ఉంటాం : వైసీపీ

ఎమ్మిగనూరు రూరల్, జూన్27: గెలుపోటములు సహజమని, పార్టీ నాయకులకు, కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ అభ్యర్థి బుట్టారేణుక అన్నారు. గురువారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆయా మండలాలు, పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో పార్టీకి, అధినేత జగన్‌కు బలం ఉందని, ఎన్నికల్లో పార్టీకి పోలైన ఓట్లే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

యాప్‌ల భారాన్ని తగ్గించాలి : ఎస్టీయూ

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 27: ఉపాధ్యాయుల బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌ల భారాన్ని కొత్త ప్రభుత్వం తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప అన్నారు. గురువారం యూనియన్ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి సుదాకర్ బాబు అధ్యక్షతన జరిగింది. గత ప్రభుత్వం ఉపాధ్యయులపై బోధనతోపాటు అదనంగా యాప్‌లో వివిధ రకాల సేవలను పొందుపరచాలని సూచించడంతో విద్యార్థులకు బోధనకు ఆటంకం కలిగిందని గుర్తుచేశారు.

సంక్షిప్తం

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పరీక్షలు

మద్దికెర, జూన్ 27: విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వార్డెన్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వసతి గృహంలో 140 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఎక్కువ శాతం విద్యార్థులు హాస్టల్‌లో చేరారని పేర్కొన్నారు.

చిన్న వ్యాపారులకు సుంకాన్ని మినహాయించాలి

పత్తికొండ టౌన్, జూన్ 27: పత్తికొండ పట్టణంలో నెత్తిన గంపలు పెట్టుకుని, మూటలు పెట్టుకుని వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారస్థులకు సుంకం మినహాయించాలని సీపీఎం;నాయకులు వెంకటేశ్వరరెడ్డి, దస్తగిరి డిమాండ్ చేశారు. గురువారం మేజర్ గ్రామ పంచాయతీ అధికారులకు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. గ్రామ పంచాయతీలో వేలంపాటలు జరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి చిరు వ్యాపారస్థులకు సుంఖం మినహాయింపు ఇచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగన్న, నారాయణ, రమేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, జూన్ 27: టీడీపీ కూటమి వాల్మీకులకు సముచిత స్థానం ఇచ్చిందని, వాల్మీకుల అభివృద్ధికి కృషి చేయాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు కోరారు. గురువారం ఆదోనిలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి శాలువ కప్పి పూలమాలలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం అన్ని సామాజిక వర్గాల ప్రజలు కృషి చేశారని వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు.

అంటు వ్యాధులపై అప్రమత్తం

తుగ్గలి, జూన్ 27 : వాతావరణ మార్పు, పరిసర ప్రాంతాల ప్రభావం వల్ల వచ్చే అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆసుపత్రి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏ గ్రామంలోనైనా డయేరియా కేసులు నమోదైతే.. తక్షణమే వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు.

ఆర్‌డీటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు

నందవరం, జూన్ 27: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఆర్‌డీటీ ఆధ్వర్యంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని గురువారం సర్పంచు తిమ్మప్ప, సూపర్‌వైజర్, టీచర్లకు ఆర్డీటీ సీఓ ప్రతాప్, ఏరియా టీం లీడర్ నాగసుదర్శన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన రికార్డు పత్రాలను అందజేశారు. ఈ కేంద్రం కోసం రూ 16,32,272 ఖర్చు చేశామని, మంచి ప్రదేశంలో చక్కని భవనం నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

దేవనకొండ ,జూన్ 27 : గత ఏడాది కరువుతో రైతులు నష్టపోయారని ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి గుడిమిరాళ్ల తిమ్మప్ప సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు మద్దిలేటిశెట్టి ,మండల కార్యదర్శి నర్సారావ్ ,తుకారాం,భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో కలుషిత నీరు సరఫరా

పెద్దకడుబూరు, జూన్27: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కలుషిత నీరు సరఫరా అవుతోంది. కొద్ది రోజులుగా రంగుమారిన నీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు ఆ నీటిని తాగి రోగులపాలవుతున్నారు. ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేసే సమయంలో ఫిల్టర్ చేయకుండానే నేరుగా వదులుతుండడంతో కలుషితనీరు సరఫరా అవుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఆ నీటిని తాగాలంటేనే భయమేస్తోందని, అధికారులు వెంటనే స్పందించి నీటిని ఫిల్టర్ చేసి వదలాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యం

హాలహర్వి, జూన్ 27: పల్లేలు ప్రగతి పథంలో నడవాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని తెదేపా తాలుకా ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం నిట్రవట్టి గ్రామంలో తెదేపా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెల్లో తెదేపా జెండా ఎగరాలని, అభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వానికి పట్టంకట్టారని, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం పంచాయతీ తరపున మంజూరైన నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు.